కొనుక్కోమనరు. 'అక్క ఉద్యోగస్తురాలు కదమ్మా, మా చీరలు నచ్చుతాయో, నచ్చవో అని దానినే తెచ్చుకోమంటాం. నేను కొని నీకు ఒళ్ళో పెడితే గాని నాకు తృప్తి వుండదు' అంటుంది అమ్మ.

'ఈయన ఎలాగూ నా మాట వినరు. ఈసారి నుంచి ఏమైనాసరే అమ్మని డబ్బులడిగి తీసుకుని నేనే చీర కొనుక్కుంటాను' నిర్ణయించుకుంది రాధ.

* * * * *

"ఎక్కడినుంచి లెటర్?" అడిగాడు మోహన్.

"నాన్న దగ్గర్నుంచి" అని మోహన్ కిచ్చింది లలిత.

"మీ వాళ్ళకి పిచ్చా! పెళ్ళి అయి ఏడేళ్ళయింది. ఇద్దరు పిల్లలు పుట్టారు. ఇంకా కొత్త అల్లుడిలాగా పండక్కి రమ్మనమని ఈ ఆహ్వానం ఏమిటి?"

"ఈ ఒక్క పండక్కే కదా, వాళ్ళు పిలిచినా, మనం వెళ్ళినా. మనకు, పిల్లలకు వారం సెలవు లుంటాయి కదా! వెళ్ళి వద్దాం. నాకూ బోర్‌గా వుంది" అంది గారంగా.

"ఊ! తప్పేదేముంది. ఏమిటో చీర అదీ తెచ్చుకోమని వ్రాశారుగా. రేపు తెచ్చుకో. బయల్దేరుదాం" అని బయటికి వెళ్ళాడు మోహన్.

'ఈసారి నుంచి ఈ పద్ధతికి స్వస్తి చెప్పాలి' అనుకుంది లలిత. 'ఎప్పుడూ నేను కొనుక్కోవడమేనా చీరలు! ఈయనకు ఈయన - పెళ్ళయిన దగ్గర్నుంచి ఒక్క చీర కొనలేదు. పిల్లలకు, నాకు కూడా నేనే తెచ్చుకోవాలి. తోడు కూడా రారు. 'నాకేం తెలుసు, నువ్వా సంపాదిస్తున్నావు. నీకు కావలసింది నువ్వు తెచ్చుకో. పైగా నీకేం చీర బావుంటుందో నాకేం తెలుసు' అంటారు. ఊ:

క్క 'అక్కా! ఇది నా పుట్టిన రోజుకి మీ మరిది తెచ్చిపెట్టారు. ఇదేమో మా వెడ్డింగ్ యానివర్సరీకి తీసుకొచ్చారు' అంటూ సిగ్గుపడుతూ, మురిపెంగా చెపుతుంది. ఈయనకు అవేమీ గుర్తువుండవు.

'ఇది మా వారు నా కోసం కొన్న చీర' అని చెప్పుకోవడానికి ఒక్క చీర కూడా లేదు కదా! ప్చ్!

'అమ్మా వాళ్ళు కూడా నన్ను సరిగ్గా అర్థం చేసుకోవడం లేదు. నవక రకం చీరైనా వాళ్ళు పెట్టింది వేరు. నేను కొనుక్కోవడం వేరు. ఆ చీర చూస్తే అమ్మావాళ్ళు పెట్టిన చీర అని గుర్తే రాదు. అది నా సెలక్షనుగా నాకు తెలుస్తూనే వుంటుంది. 'మా అమ్మ పండక్కి పిలిచి నాకు పెట్టిన చీర' అనే భావనతో నా మనస్సు స్పందించాలి. ఈ పద్ధతిలో నాకు తృప్తి కనిపించడం లేదు. మన ప్రేమను సున్నితమైన భావనతో వ్యక్తపరచటానికే ఈ పెట్టు పోతలు అనుకుంటాము. కేవలం డబ్బుతో లెక్క చూసుకుంటే ఎలా? ఈసారినుంచి నేను అమ్మ తోనే కొనిపించుకుంటాను. నా కోరిక అమ్మకి తెలియజేస్తాను' అనుకుంది లలిత. ●



నందివాడ సుబ్బలక్ష్మి

## తస్మాత్ జాగ్రత్త

సుబ్బారావు మాస్టారు ఆదరాబాదరాగా బస్‌స్టాండ్‌కు పరు గెత్తుకొచ్చేరు.

ఆయన అర్జంటుగా గుంటూరు వెళ్ళాలి. నాన్‌స్టాప్ బస్ రెడీగా వుంది. 'హమ్మయ్య' అనుకున్నాడాయన. కాని ఏం లాభం. ఇప్పుడు బస్సులో ఇవ్వడం లేదు టిక్కెట్లు. వేరే కౌంటర్ పెట్టేరు.

కౌంటరు దగ్గర చూసేరు. కొండవీటి చేంతాడంత వుంది క్యూ. లైన్లో నుంచుంటే లాభం లేదనుకుని-

"ప్లీజ్... అర్జంటుగా గుంటూరు వెళ్ళాలి. ఏమీ అనుకో కండి ఒక్క టిక్కెట్టు తీసిపెట్టండి" అని లైన్లో కొంచెం ముందుగా నుంచున్న ఒకతనికి ఐదు రూపాయిల కాగితం ఇవ్వబోయేరు.

"సారీ సార్... ఇప్పటికే నా దగ్గర ముగ్గురుకి సరిపడా వున్నాయ్... మరెవ్వరికేనా ఇవ్వండి" అన్నాడు ఆ వ్యక్తి.

"నాటితోపాటు ఇదొకటి ఫర్వాలేదు... ప్లీజ్ తియ్యండి" అని ఐదు రూపాయిల కాయితం అతని చేతులో కుక్కారు మాస్టారు బలవంతంగా.

"సరే మీరెళ్ళి బస్సులో కూర్చోండి. పక్కన రుమాలు వేసి వుంచండి నాకు. రెండు నిమిషాల్లో టిక్కెట్లు తీసుకొని వచ్చేస్తాను" అన్నాడా వ్యక్తి ఐదు కాగితం తీసుకుని.

"ఓకే" అని మాస్టరు బస్సెక్కి కుడివేపున మూడు సీట్లలో రెండు సీట్లు ఖాళీగా వుంటే ఓ సీటు తను కూర్చుని రెండో సీట్లో చేతి రుమాలు పరిచి వుంచేరు.

అప్పటికే దాదాపు బస్సు నిండిపోయింది.

మరో రెండు నిమిషాల్లో డ్రైవరు వచ్చి టిక్కెట్లు లెక్క చూసుకుంటున్నాడు.

'అయ్యా బస్సులో టిక్కెట్లు లేని వాళ్లుంటే దిగిపోండి' అని హెచ్చరిక చేసేడు.

మాస్టారు అతని కోసం ఎదురు చూస్తున్నారు.

అతనెంతకీ రావడం లేదు.

"ఒక్క నిమిషం వుండవయ్యా... ఒకతనికి డబ్బులిచ్చి నా టిక్కెట్టు తెమ్మనమని... వచ్చేస్తాడు" అన్నాడాయన డ్రైవర్‌తో.

"లేదుసార్ టైం అయిపోయింది. బుక్కింగ్ కూడా క్లోజ్ అయిపోయింది. కౌంటరు దగ్గర ఎవ్వరూ లేరు. మీరు దిగండి" అన్నాడు డ్రైవరు.

మాస్టారుకి మతి పోయింది. రుమాలు తీసుకుని డోర్ దగ్గరకొచ్చి క్రిందకి అటూ ఇటూ చూసేరు. ఆ వ్యక్తి ఎక్కడా కనిపించడం లేదు. చేసేది లేక బస్సు దిగి పోయేడాయన.

"ఎవడో నుస్కా కొట్టేడు పాపం!" అంటున్నాడొకాయన బస్సులోంచి. బస్సు బయల్దేరింది.

వెళ్ళి లైన్లో నిలబడ్డారు టికెట్టు కోసం.

"సార్ సార్... ఏమీ అనుకోకండి గుంటూరుకి ఒక్క టిక్కెట్టు తీసిపెట్టండి" అంటూ ఒకాయన వచ్చి మూడు డబ్భై ఐదు చిల్లర ఇవ్వబోయేడు మాస్టారుకి.

"వద్దుసార్... నే నిపుడే దెబ్బతిన్నాను. ఒకతనికి టికెట్టు తియ్యమని ఐదు రూపాయిల కాగితం ఇచ్చాను. మీరెళ్ళి బస్సులో కూర్చోండి, టిక్కెట్టు తెస్తానని నిపులేకుండా పోయేడు. అందువల్ల ఏం అనుకోకండి. ఎప్పుడూ, మీ టిక్కెట్టు మీరు తీసుకోడమే మంచిది. ప్లీజ్ గో అండ్ స్టాండ్ ఇన్ ది లైన్" అన్నారు మాస్టారు.

— వి.ఎస్.ఆర్. మూర్తి